సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 26 । ఆగస్టు । 2024



తండాల్లో 'జోగ్' సందడి

గిరిజన తండాల్లో 70 ఏళ్ల ఆచారం తిరిగి ఇటీవల పునఃప్రారంభం కావడంతో జోగ్ ఉత్సవాల సందడి నెలకొంది.


- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 44734 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 44734 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 25009 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9047 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1087 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 1685 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 215.46 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 119.70 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను నేడు(సోమవారం) మాకు పంపించండి. మంగళవారం సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయస్సు 10 సంవత్సరాలలోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పని సరిగా పేర్కొనాలి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్

81060 22530

• బోనమెత్తిన పహిల్వాన్‌పురం



వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. పచ్చని పంటపొలాల నడుమ ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. - వలిగొండ

జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో 27న ఫోన్‌ఇన్



గ్రామాలు, పట్టణాల్లో వైరల్ ఫీవర్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. జ్వరం తగ్గినా బాధితులు నీరసించి పోతున్నారు. ఈక్రమంలో వైద్య సలహాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుతో ఈనెల 27న 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. బాధితులు నేరుగా ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు



రాజారావు, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

తేది. 27.08.2024 మంగళవారం
సమయం : ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : **98490 10915**

హైడ్రా మాకూ కావాలి

- హెచ్‌ఎండీఏ, వైటీడీఏ పరిధిలో చెరువులు, కుంటలు మాయం
- అక్రమ నిర్మాణాల తొలగింపు ఇక్కడా చేపట్టాలని కోరుతున్న జిల్లా వాసులు
- అక్రమార్కుల గుండెల్లో వణుకు

సాక్షి, యాదాద్రి: ఆపరేషన్ హైడ్రా.. ఇప్పుడు అందరి నోటా ఇదే చర్చ. హైదరాబాద్ జంట నగరాల్లో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న అనేక భవనాల సముదాయాలను కూల్చివేస్తున్న పరిణామాలపై అంతటా ఆసక్తి నెలకొంది. అయితే అక్రమ నిర్మాణాల తొలగింపు యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా ఉంటుందా అన్న చర్చ మొదలైంది. హైడ్రా చర్యలతో రాజధానికి పొరుగున ఉన్న జిల్లాలో కూడా చెరువులు, కుంటల పరిరక్షణ చర్యలు ఉంటే బాగుంటుందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.



ఆక్రమణకు గురైన భువనగిరి పెద్ద చెరువు

నిబంధనలు తుంగలో తొక్కి..

హెచ్‌ఎండీఏ, వైటీడీఏ, డీటీసీపీ (టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్) డీటీసీపీ ద్వారా జారీ అయిన లేఅవుట్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల అనధికార లేఅవుట్‌లలో చెరువులు, కుంటలు మాయమయ్యాయి. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు, తీనం చెరువు, యాదగోని చెరువు, చౌటుప్పల్ చెరువు, యాదగిరిగుట్టలోని చెరువులు, కుంటలను పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. భువనగిరి పెద్ద చెరువులో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఎఫ్‌టీఎల్ లో అక్రమ నిర్మాణం చేపట్టింది. చౌటుప్పల్‌తోపాటు పలుచోట్ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఇళ్లు, భవనాలు, కంపెనీలు నిర్మించారు. రియల్టర్ల ధనదాహానికి చెరువులు, కుంటలు మాయమయ్యాయి. ఆలేరు మండలం రాఘవాపురం చెరువులో లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించారు. ఇలా ఒక్కటేమిటి హెచ్‌ఎండీఏ పరిధిలో పలు చెరువులు మాయం అయ్యాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారు.

260కిపైగా చెరువులు కబ్జా

రాజధానికి పొరుగున ఉన్న హెచ్‌ఎండీఏ మండలాలు, వైటీడీఏ, గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. హెచ్‌ఎండీఏ పరిధిలోని భువనగిరి మున్సిపాలిటీ, మండలం, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, బొమ్మలరామారం మండలాల్లో వెలిసిన వెంచర్లలో 260కి పైగా చెరువులు కబ్జాకు గురయ్యాయని గతంలోనే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు తేల్చారు. దీంతోపాటు యాదగిరిగుట్ట, భువనగిరి, రాజాపేట, ఆలేరు తోపాటు పలు మండలాల్లో రియల్ వ్యాపారులు చెరువులు, కుంటలు యథేచ్ఛగా పూడ్చారు. హైదరాబాద్‌లోని ప్రజలను టార్గెట్ చేసిన రియల్టర్లు బ్రోచర్లు, బ్రోకర్ల ద్వారా ప్రజలను నమ్మించి ప్లాట్లు విక్రయించారు. లే అవుట్ నిబంధనలు ఎక్కడా పాటించలేదు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్ల క్రయ విక్రయాలు జరిగాయి. అయితే చెరువులు, కుంటల ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలుంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

రైతు భరోసా రాకపాయే !

- వానాకాలం సీజన్ ముగుస్తున్నా స్పష్టత కరువు
- పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- 2.71 లక్షల మంది ఎదురుచూపు



సాక్షి, యాదాద్రి: రైతు భరోసా సాయంపై స్పష్టత కరువైంది. వానాకాలం సీజన్ ముగుస్తున్నా నేటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆనంద పడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతు బంధు పేరుతో సీజన్ ఆరంభంలో రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమచేసేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నేటికీ రైతులకు రైతు భరోసా ఇవ్వలేదు. ఫలితంగా పెట్టుబడి సాయం కోసం జిల్లాలో 2,71,979 మంది రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రతి సీజన్‌కు ఇలా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు రెండు సీజన్లకు కలిపి రూ.10 వేల చొప్పున రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రతి సీజన్‌కు 2,71,979 మంది రైతులకు రూ.304.85 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేసేది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ సీజన్ ముగుస్తున్నప్పటికీ నేటికి రైతు భరోసా నిధులను జమ చేయకపోవడంతో రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇస్తారా..? లేక రూ.15 వేల చొప్పున రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని ఇస్తారా? అనే దానిపై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించలేదు. దీంతో రైతు భరోసా నిధులపై సందిగ్ధత నెలకొంది.

కొత్త రుణాలు ఇవ్వని బ్యాంకర్లు

ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలు కలిగిన రైతులకు మూడు విడతల్లో మాఫీ చేసింది. ఇందులో వేలాది మంది రైతులకు వివిధ సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాలేదు. రుణమాఫీ పొందిన రైతులకు సైతం అనేక బ్యాంకుల్లో పంట రుణాలను తిరిగి ఇవ్వడం లేదు. రుణమాఫీ దక్కని రైతులకు కూడా బ్యాంకర్లు కొత్తగా పంట రుణాలను ఇవ్వడానికి ఇష్టపడటం లేదు. దీని కారణంగా వానాకాలం సీజన్‌లో రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా విధివిధానాలు ఖరారుచేసి పెట్టుబడి సాయం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే రైతు భరోసా ఇవ్వాలి



ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలి. పంట పెట్టుబడుల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సి వస్తోంది.

– కొండమడుగు నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

భువనగిరిటౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వం సెలవు దినం ప్రకటించిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

పంచనారసింహుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: పంచనారసింహ క్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. అర్చకులు ఉదయం సుప్రభాతం, ఆరాధన జరిపించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రికి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ద్వార బంధనం చేశారు.

29న జాతీయ క్రీడా దినోత్సవం

భువనగిరి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ ఆవరణలో జిల్లా యువజన క్రీడ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడాపోటీలకు ఆసక్తి కలిగిన ఉద్యోగులు 27వ తేదీన సాయంత్రంలోపు తమ వివరాలను 83099 92451 నంబర్‌కు వాట్సప్ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వాక్, షాట్‌పుట్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, పురుషులకు వాక్, రన్నింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, చెస్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

బీపీ మండల్ ఆశయసాధనకు కృషిచేయాలి



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

మోత్కూరు : ప్రతిఒక్కరూ బీపీ మండల్ ఆశయసాధనకు కృషిచేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆదివారం బీపీ మండల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, మధు, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- భువనగిరిలో అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాపోటీలు ప్రారంభం

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజ నర్సింహారావు మెమోరియల్ ఐటీఎఫ్ జూనియర్స్ అండర్–18 అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో టెన్నిస్ క్రీడను ప్రోత్సహించేందుకు భువనగిరిలో 8 సింథటిక్ కోర్టులను ఏర్పాటు చేయడం, మరో రెండు క్లే కోర్టులను ఏర్పాటుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాయిగిరి శివారులో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు జరిగే టెన్నిస్ క్రీడాపోటీల్లో యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, నేపాల్ తదితర దేశాలకు చెందిన 170 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అశోక్ కుమార్, న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ పులిమామిడి సుభాష్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్, కార్యదర్శి నారాయణ దాస్, జిల్లా అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, దిడ్డి బాలాజీ, ఐటీఎఫ్ సూపర్‌వైజర్ శివకుమార్ రెడ్డి, సందీప్ రెడ్డి, శివాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

- ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జహంగీర్

భువనగిరిటౌన్: వక్ఫ్ బోర్డు అధికారాలను నిర్వీర్యం చేసే విధంగా కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొస్తుందని, దీనిని ప్రజలు వ్యతిరేకించాలని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో ఆవాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ– 2024 బిల్లుపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డులో ఇతరులకు ప్రవేశం కల్పించడం, వక్ఫ్ బోర్డు భూములను ప్రభుత్వ భూములుగా మార్చే కుట్రలో భాగంగానే కలెక్టర్లకు విశేష అధికారాలిస్తూ బిల్లు తేవడం, ట్రిబ్యునల్‌ను సవాల్ చేయడం లాంటి 44 సవరణలు తీసుకొచ్చారని, వీటితో వక్ఫ్ భూముల స్వాహా చేయడంతోపాటు, ముస్లింల సంక్షేమానికి నష్టం జరుగుతుందన్నారు. దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్ భూములు, చారిటీ భూముల జోలికి వస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. యూసుఫ్ అలీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్కే లతీఫ్, ఎండి పాషా, బట్టు రామచంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నరసింహ, నాయకులు ఎస్.కె హమీద్, ఎండీ గౌస్, ఎండీ ముక్తార్ హుస్సేన్, ఎండీ జహీరుద్దీన్, ఎండీ సుజావుద్దీన్, ఎండీ సలీం, ఎండీ ఉస్మాన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు నేడు స్పాట్ కౌన్సిలింగ్

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు నేడు (సోమవారం) స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద శనివారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

• శ్రావణ వ్రతం



శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహించిన శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ గాలికి

- భువనగిరిలో నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

భువనగిరిటౌన్: భువనగిరి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. యాదాద్రి క్షేత్రం, స్వర్ణగిరి దేవాలయ సందర్శనతోపాటు వివిధ పనుల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యక్తిగత పనుల నిమిత్తం భువనగిరి పట్టణానికి ఎంతో మంది వస్తుంటారు. దీంతో పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఏరియా ఆస్పత్రి ఎదురుగా, భువనగిరి బస్టాండ్ ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించారు. అదేవిధంగా రాయిగిరిలో నూతనంగా పబ్లిక్ టాయిలెట్ నిర్మించి వదిలేశారు. వాటిలో అన్ని వసతులు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.



భువనగిరిలోని ఏరియా ఆస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లు

ఉపయోగంలోకి తెస్తాం

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ టాయిలెట్లు గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాల ప్రతినిధులకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలో కొన్నింటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తాం.

– ప్రసాద్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

డ్రాప్‌బాక్సులో నిరీక్షణ

- పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థి వివరాలు ఆన్‌లైన్ డ్రాప్‌బాక్స్ నుంచి తీసుకోవాల్సిన ప్రధానోపాధ్యాయులు
- ఇది జరిగితేనే ఆ విద్యార్థి పాఠశాలలో చేరినట్లు లెక్క
- ఇప్పటివరకు నమోదు కాకుండా ఉన్న 12,200 మంది విద్యార్థులు



భువనగిరి: విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు గడిచింది. విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు ఇవ్వడం దాదాపుగా పూర్తయ్యాయి. అయితే టీసీలు పొంది పాఠశాల మారాలనుకున్న విద్యార్థులు తాజాగా 12,200 మంది యూడైస్ ప్లస్‌లోని డ్రాప్‌బాక్సులో నిరీక్షిస్తున్నారు. బడిలో చదివే ప్రతి విద్యార్థికి 11 అంకెలు గల పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్(పీఈఎన్) కేటాయిస్తారు. ఈ సంఖ్యతో పాటు విద్యార్థుల పూర్తి వివరాలను యూడైస్ ప్లస్‌లో ఈ నెలాఖరులోగా సరిచూసుకోవాలి. గతేడాది వీటిని సరిచేసే అవకాశం మండల స్థాయిలో ఉండగా ఈ సారి ఈ మార్పులకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓల ధ్రువీకరణతో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఈక్రమంలో విద్యార్థులందరి వివరాలు సంబంధిత ప్రధానోపాధ్యాయులు డ్రాప్ బాక్సు నుంచి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

నమోదైన విద్యార్థులు ఇలా..

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని యాజమాన్యాల్లో 12వ తరగతి వరకు 1,06,000 మంది నమోదై ఉన్నారు. అయితే ఇంకా 12,200 మంది విద్యార్థులు ఏ పాఠశాలల్లోగాని , ఏ కళాశాలలోగాని నమోదు కాకుండా ఆన్‌లైన్ డ్రాప్‌బాక్సులో మిగిలి ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులే సుమారు 5వేల మంది వరకు ఉంటారు. వీరు చేరిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డ్రాపు బాక్సు నుంచి తమ పాఠశాల, కళాశాల ఖాతాలో వేసుకోవాల్సి ఉంటుంది.

డ్రాప్‌బాక్సు అంటే..

విద్యార్థి పాఠశాల మారే సందర్భంలో ఇదివరకు ప్రధానోపాధ్యాయులు ఇచ్చే టీసీ ఆధారంగా పాఠశాలల్లో ప్రవేశం కల్పించేవారు. ప్రస్తుతం ఈ టీసీతో పాటు ఆన్‌లైన్ టీసీ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఓ పాఠశాల నుంచి టీసీని విడుదల చేస్తూ ప్రధానోపాధ్యాయులు ఆ విద్యార్థి టీసీ వివరాలను ఆన్‌లైన్ డ్రాప్‌బాక్సులో పొందుపరుస్తారు. సదరు విద్యార్థి కొత్తగా చేరిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆ విద్యార్థిని ఆన్‌లైన్ డ్రాపుబాక్సు నుంచి తీసుకోవాలి. ఇది జరిగితేనే ఆ విద్యార్థి పాఠశాలలో చేరినట్లు లెక్క. ఈ డ్రాప్‌బాక్సును ఖాళీ చేయనంత వరకు ఆ విద్యార్థులు ఏ పాఠశాలలో చేరనట్లే. దీంతో ఆ విద్యార్థి పాఠశాల లెక్కలోకి రారు.

గిరిజన తండాల్లో 'జోగ్' సందడి


జోగ్ ఉత్సవాల్లో బావోజి బిక్కునాయక్, భక్తులు


తుల్సాసాద్ దేవాలయం

- 70ఏళ్ల తర్వాత పునఃప్రారంభం
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

చందంపేట: గిరిజన తండాల్లో సుమారు 70 సంవత్సరాల క్రితం తులసీసాద్ శ్రీకారం చుట్టిన జోగ్ ఉత్సవాలను ఆ తర్వాత వాంకుడావత్ పాడ తెగ వారు కొనసాగించారు. సుమారు 70 ఏళ్ల ఆచారం తిరిగి ఇటీవల పునఃప్రారంభం కావడంతో తండాల్లో పండుగ సందడి నెలకొంది. 12 రోజుల పాటు జరిగే జోగ్ ఉత్సవాల్లో ఒక్కో రోజు ఒక్కో బావోజి(పూజారి) ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తారు. శ్రావణ మాసంలో జరిగే జోగ్ ఉత్సవాలు తండాల్లో కొత్త సందడి తీసుకొచ్చింది.

బిక్కు బావోజీ ఆధ్వర్యంలో..

వాంకుడావత్ పాడకు చెందిన బిక్కు బావోజి 70 ఏళ్ల గిరిజన సంప్రదాయ పండుగ తిరి జోగ్‌కు అంకురార్పణ చేశారు. నేరెడుగొమ్ము మండలంలోని సుద్ద బావితండాలోని భర్మస్వామి ఆలయ పూజారి అయిన బిక్కు బావోజి నేతృత్వంలో సాగుతున్న జోగ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన గిరిజనులు స్వగ్రామాలకు చేరుకున్నారు. 12 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో కఠిన ఉపవాస దీక్షలు ఆచరించడంతో పాటు చెప్పులు ధరించకుండా తండాలలోని ప్రతి ఇంటిని సందర్శించడం జరుగుతుంది. ఈ క్రమంలో స్వయంగా దేవుడే తమ ఇంటికి వచ్చాడని భావించి ప్రజలు పూజలు చేస్తూ తమ మొక్కులు సమర్పించుకుంటారు. బావోజి వెంట ప్రతిసారి 500 మందిపైగా గిరిజనులు ఉండడం విశేషం. పగలు, రాత్రి భర్మస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఒక్కో తండాను సందర్శిస్తూ ప్రతి ఇంటికి బావోజి రావడం ఆనవాయితీ. ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల సమీపంలో ఉన్న కాకిరాల గ్రామంలో సైతం ఐదు రోజుల పాటు జోగ్ ఉత్సవాలు నిర్వహిస్తుండడం గమనార్హం. ఈనెల 14న ప్రారంభమైన జోగ్ ఉత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి.

ప్రసాదంగా జొన్నలు పంపిణీ

జోగ్ ఉత్సవాల్లో భాగంగా భర్మస్వామి దేవాలయంలో ప్రసాదంగా జొన్నలకు పంపిణీ చేస్తారు. ఈ జొన్నలు తీసుకునేందుకు గిరిజనులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తుంటారు. ఆలయంలో బావోజి చేతులమీదుగా పంపిణీ చేసే జొన్నలను గిరిజనులు తీసుకొని తమ ఇళ్లల్లో తాము వండుకునే వంటకాల్లో వేసుకొని తింటారు. ఈ జొన్నలను తీసుకోవడం వల్ల తమ బాధలు దూరమై తమ కోర్కెలు తీరుతాయని నమ్ముతారు.

రూ.కోటితోతుల్సాసాధ్ దేవాలయం

నేరెడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ సమీపంలో బంగారిగుండ్ల వద్ద భక్తులు ఇచ్చే కానుకలు, దాతల సహకారంతో సుమారు కోటి రూపాయల వ్యయంతో శ్రీతుల్సాసాద్ దేవాలయం నిర్మించారు. తుల్సాసాద్‌ను గిరిజనులు తమ ఆరాధ్య దైవంగా కొలుస్తుంటారు. తుల్సాసాద్‌తో పాటు చంద్రుసాద్, బిచ్చసాద్, థావుర్యసాద్ మఠాలను ఆలయంలో ఏర్పాటు చేసి గిరిజనులు భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో ఈ దేవాలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తుంటారు.

పూర్వీకుల ఆచారం తిరిగి ప్రారంభమైంది



మా పూర్వీకులు 70 ఏళ్ల క్రితం చేసిన జోగ్(పేరి) ఉత్సవాలను మళ్లీ ఇప్పుడు తిరిగి కొనసాగిస్తున్నాం. గ్రామాలు, తండాలు సుభిక్షంగా ఉండాలని జోగ్ ఉత్సవాలు జరుపుకుంటాం. బావోజి ప్రతి ఇంటిని సందర్శించి భక్తులకు దీవెనలు ఇస్తారు. ఇక నుంచి ప్రతి ఏడాది శ్రావణమాసంలో జోగ్ ఉత్సవాలు జరుపుకుంటాం.

– వాంకుడావత్ శ్రీనునాయక్, ఆలయ కమిటీ చైర్మన్, తుల్సాసాద్ దేవాలయం

క్లుప్తంగా

డీసీఎం ఢీకొని వృద్ధుడి మృతి

మునగాల: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడిని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ శివారులో జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన గుంజ ఎల్లయ్య(72) చిలుకూరు మండలం పోలేనిగూడెం శివారులో ఉన్న తన పొలం వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నుంచి హైవే మీదకు వస్తుండగా.. వెనుక నుంచి డీసీఎం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎం) మండలం లింగరాజుపల్లిలో శనివారం సాయంత్రం జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన అంబోజు నర్సింహ(54) తన కుమార్తె పెళ్లి కోసం, కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం వలిగొండ మండలంలోని లోతుకుంట గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్లే ప్రయాణికులు గుర్తించి లింగరాజుపల్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

చౌటుప్పల్ రూరల్: మండలంలోని నేలపట్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాదాపు 20మంది రైతుల పొలాల వద్ద స్టార్టర్ల నుంచి మోటార్ల వరకు అమర్చిన వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వ్యవసాయ బావుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

మాంద్ర అర్చకుడికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న నరసింహాచార్యులు


నార్కట్‌పల్లి: మండలంలోని మాంద్ర గ్రామంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు ఉత్తరపల్లి నరసింహాచార్యులు అర్చక సామ్రాట్ బిరుదుతో పాటు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన తెలుగు సంస్కృతి జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి అద్దంకి నాగేశ్వరరావు చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వచ్చి చేరుతుండడంతో ఆదివారం తెల్లవారుజామున రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగులు మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. తిరిగి మధ్యాహ్నం 2గంటలకు గేట్లు మూసివేశారు. సాగర్ జలాశయంలో ప్రస్తుతం గరిష్ట స్థాయిలో 590 అడుగుల మేర నీరు ఉంది. విద్యుదుత్పాదన ద్వారా 29070 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 17,348 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 1800, వరద కాల్వ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల సందడి..

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. రెండు గేట్లు ఎత్తారని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పర్యాటకులు కృష్ణమ్మ అందాలు తిలకించేందుకు వచ్చారు. గేట్లు మూసివేసిన తర్వాత స్పిల్ వే మీదుగా జాలువారుతున్న నీరు పర్యాటకులను ఆకట్టుకుంది.


దిగువకు విడుదలవుతున్న నీరు

మూసీ ప్రాజెక్ట్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి

- రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం వరకు మూసీకి ఎగువ ప్రాంతాల నుంచి 1,087 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,290 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా 643.40 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 335 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 1,685 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. మూసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.04 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.


మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

పులిచింతలకు 30,311 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువన సాగర్, టెయిల్‌పాండ్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం 29,638 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం 30,311 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో ప్రాజెక్టులోని 2 క్రస్ట్ గేట్లు 1.5 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 28,570 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల కూసెక్కుల నీటిని దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 45.56 టీఎంసీల నీరు ఉంది.

105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- బస్సు క్లీనర్ మృతి
- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

వేములపల్లి: ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టడంతో బస్సు క్లీనర్ మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల నుంచి 27 మంది ప్రయాణికులతో మార్నింగ్‌స్టార్ ట్రావెల్స్ బస్సు శనివారం రాత్రి 8గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరింది. బస్సులో డ్రైవర్ మురళీ, క్లీనర్ దావాల దావీద్ (40) ఉన్నారు. మార్గమధ్యలో అర్ధరాత్రి 2గంటల సమయంలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామశివారులోని మహర్షి మిల్లు వద్ద రోడ్డు వెంట నిలిచి ఉన్న డీసీఎంను బస్సు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ దావీద్ డీసీఎం, బస్సు మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రయాణికులు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.


డీసీఎంను ఢీకొట్టడంతో ధ్వంసమైన మార్నింగ్‌స్టార్ ట్రావెల్స్ బస్సు ముందుభాగం

టైరు పేలి ట్రావెల్స్ బస్సు బోల్తా..

టైరు పేలి ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన వేములపల్లి మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎల్‌వీఆర్ ట్రావెల్స్ బస్సు శనివారం సాయంత్రం 5గంటల సమయంలో జగిత్యాల నుంచి 30 మంది ప్రయాణికులతో పాటు ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పామూరుకు బయల్దేరింది. ఆదివారం తెల్లవారుజామున వేములపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే బస్సు ముందు ఎడమ టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు అవతలి వైపునకు వెళ్లి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను వేరే బస్సులో తమ గమ్యస్థానాలకు తరలించారు. అనంతరం క్రేన్‌తో బస్సును రోడ్డు పక్కకు తీశారు.


బోల్తా పడిన ఎస్ఎల్‌వీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

గినియా దేశంలో వలిగొండ వాసి మృతి

వలిగొండ: గినియా దేశంలో ఈ నెల 18వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లికి చెందిన గండమల్ల శ్రీశైలం, అతడి కుమారుడు భరత్(24) కొంతకాలం క్రితం గినియా దేశం వెళ్లి బోరు బండ్లను నడిపిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన వారు వెళ్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టడంతో భరత్ మృతిచెందాడు. భరత్ మృతదేహం ఆదివారం స్వగ్రామం వర్కట్‌పల్లికి చేరుకోగా.. కుటుంబ సభ్యులు, బంధువులు దహన సంస్కారాలు నిర్వహించారు.

ఉరి వేసుకుని రైతు బలవన్మరణం

రాజాపేట: ఉరేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండలం బసంతపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బసంతపురం గ్రామానికి చెందిన మెండు బుచ్చిరెడ్డి(50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య ఊర్మిళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం అయ్యింది. బుచ్చిరెడ్డి ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న మరో రైతు చూసి బుచ్చిరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉపేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుచ్చిరెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.


కలవరపెడుతున్న సాగర్ డ్యాం లీకేజీలు

- డ్యాం నాన్‌ఓవర్ ఫ్లో సెక్షన్‌లో ఆగని నీటి ఊట

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాం లీకేజీలు ఆయకట్టు రైతులు, అధికారులను కలవరపెడుతున్నాయి. డ్యాం నాన్ ఓవర్‌ఫ్లో సెక్షన్‌లో కొన్ని బ్లాకుల నుంచి నీటి ఊట వస్తోంది. ప్రధాన డ్యాంలో 1 నుంచి 23వ బ్లాకు వరకు ఎడమ వైపు నాన్ ఓవర్ ఫ్లో సెక్షన్ ఉండగా 24 నుంచి 50వ బ్లాకు వరకు 26 రేడియల్ క్రస్ట్ గేట్లు అమరి ఉన్న ఓవర్‌ఫ్లో సెక్షన్ ఉంది. స్పిల్ వేకు కుడివైపు 51 నుంచి 76 వరకు బ్లాకులు ఉన్నాయి. జలాశయంలో గరిష్ట నీటిమట్టం వచ్చినప్పుడల్లా డ్యాం నుంచి నీరు లీకవుతోంది. సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణలో భాగంగా 2013లో డ్యాం లోపలి వైపు ఇనుప జాలి ఏర్పాటు చేసి సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేశారు. దీంతో కొన్ని చోట్ల నీటి లీకేజీలు ఆగిపోయాయి. ముఖ్యంగా డ్యాంపై ఉన్న కంట్రోల్ రూంకు వైపు బాగా నీరు కారుతూ ఉండేది. అది కొంతమేరకు తగ్గింది. స్పిల్ వేపై 546 అడుగుల లెవల్‌లో క్రస్ట్ గేట్లు అమర్చారు. స్పిల్ వేకు ఎడమ వైపు లిఫ్టుకు కుడివైపున స్లూయిస్ గేట్ పక్కన 22, 23బ్లాకు వద్ద 510 అడుగులకు దిగువ నుంచి నీరు లీకవుతోంది. అదేవిధంగా కంట్రోల్ రూంకు ఎడమ వైపు 51, 52 పోర్షన్లలో నీటి కూడా లీకేజీలు ఆగడంలేదు. కుడి కాల్వకు ఎడమ వైపు 70వ బ్లాకులో అదే పరిస్థితి ఉంది. 51వ బ్లాకు వద్ద కుండకు చిల్లుపడ్డట్లు నీరు కారుతుండగా... మరమ్మతులు చేయడంతో కొంతమేర నీటి లేకేజీ తగ్గింది. రాతితో నిర్మించిన డ్యాంలకు సీపేజీ సహజమేనని అధికారులు కొట్టి పారేస్తున్నారు. డ్యాం నిర్మాణ సమయంలో మొదట కింద నిర్మాణం చేసి ఆపైన తర్వాత నిర్మించడంతో జాయింట్స్ నుంచి నీరు లీకవుతోంది.

స్పిల్ వే భాగంలోనూ ఇలాగే..

డ్యాం 546 అడుగుల పైభాగంలో క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశారు. దిగువ భాగంలో స్పిల్ వే ఉంటుంది. దీనినే ఓవర్‌ఫ్లో పోర్షన్‌గా పిలుస్తారు. గేట్ల కిందిభాగంలో స్పిల్ వే మీద నుంచి నీరు లీకై పాకూరు పట్టింది. 26 క్రస్ట్ గేట్లలో సగం గేట్ల నుంచి నీరు కారుతూనే ఉన్నాయి. ఈ సమస్య మరింత జటిలం కాకముందే అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.


నాన్‌ఓవర్ ఫ్లో సెక్షన్ నుంచి లీకవుతున్న నీరు

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

చిలుకూరు: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన చిలుకూరు మండలం దూదియాతండాలో ఆదివారం జరిగింది. దూదియాతండాకు చెందిన భూక్యా సక్కుబాయి తన గేదెలను ఇంటి ముందు కట్టేసింది. ఇంటి సమీపంలో పైనుంచి వెళ్లిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగి గేదెలపై పడడంతో అవి మృతిచెందాయి. గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని సంబంధిత అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోయింది. గేదెల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

ఎంపీఈఓ పోస్టులు సృష్టించాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరామ్

తిరుమలగిరి (తుంగతుర్తి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఎంపీఈఓ(మండల పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) పోస్టులను సృష్టించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరామ్ కోరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నిర్వహించిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఎంపీఈఓలకు అప్పగించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉండే పాఠశాలల పర్యవేక్షణను మండల విద్యా శాఖ అధికారులకు యథాతథంగా ఉంచాలని కోరారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల సంఖ్యను పెంచిందని, కానీ ప్రభుత్వం జిల్లాకు డీఈఓ పోస్టులు మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో 12 డీఈఓ పోస్టులే ఉన్నాయని తెలిపారు. ఎక్కువ మంది ఇన్‌చార్జి డీఈఓలే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈఓలే ఉండటంతో పాఠశాలల నిర్వహణ పడకేసిందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో టీయూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దేవన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కైలాసం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్‌రెడ్డి, సహ అధ్యక్షులు దామెర శ్రీనివాస్, దశరథ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణప్రసాద్, అరవింద్, జానకిరాములు, రవికుమార్, వెంకన్న, షబి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల లచ్చిరామ్

యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయ మాడ వీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న 40వేల మందికిపైగా భక్తులు

యాదగిరిగుట్ట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో జంట నగరాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కొండపైన, కొండ కింద బస్టాండ్లు, మాడ వీధులు భక్తులతో నిండుగా కనిపించాయి. ధర్మ దర్శనానికి సుమారు మూడు గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు అధికంగా సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. స్వామిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.48,47,250 వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హాలియా: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా పట్టణంలో నివాసముంటున్న దేగావత్ రాంబాబు, వనిత దంపతులకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంబాబు ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. రాంబాబు, వనిత మధ్య ఈ నెల 22వ తేదీన గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన వనిత అదే రోజు గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. ఆదివారం మృతురాలి తమ్ముడు సబావత్ రంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. వనిత మృతదేహాన్ని సాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వర్ధమానుకోట వాసికి డాక్టరేట్

నాగారం: మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన మట్టపల్లి రామచంద్రు గణిత విభాగంలో ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'హీట్ అండ్ మాస్ ట్రాన్సఫర్ అనాలసిస్ ఆఫ్ ఎంహెచ్‌డీ నాన్–న్యూటోనియన్ నానో ఫ్లూయిడ్స్ ఫ్లో విత్ గైరోటాక్టిక్ మైక్రో ఆర్గానిసమ్స్ ఇన్ఏ పోరస్ మీడియం ఓవర్ డిఫరెంట్ జామెట్రీస్' అనే అంశంపై పరిశోధనలు చేసి గ్రంథాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈయన ప్రస్తుతం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకోవడం పట్ల ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రామచంద్రును అభినందించారు.


థీసిస్ సమర్పిస్తున్న మట్టపల్లి రామచంద్రు

గుండెపోటుతో తాటిచెట్టుపై గీత కార్మికుడి మృతి

భూదాన్‌పోచంపల్లి: గుండెపోటుతో తాటిచెట్టుపైనే గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసుల రాములు(60) రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం గ్రామ శివారులోని కోళ్ల ఫాం సమీపంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా గుండెపోటు వచ్చింది. దీంతో తాటిచెట్టు పైనే మోకుకు వేలాడుతూ ప్రాణాలొదిలాడు. రాములు రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి అతడి భార్య అంజమ్మ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. అతడిని వెతుక్కుంటూ గ్రామ శివారులోకి వెళ్లేసరికి తాటిచెట్టు పైన రాములు తలకిందులుగా వేలాడుతూ కన్పించాడు. ఆమె వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో రాములు మృతదేహాన్ని కిందికి దించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి వివాహితులైన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


రాములు (ఫైల్)